బ్రహ్మోత్సవం శోభాయమానం



అగ్నిగుండం వద్ద పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి



క్యూలైన్లో భక్తులు

- కనుల పండువగా అగ్నిగుండం
- భక్తులతో కిక్కిరిసిన పాంబండ దేవస్థానం
- ఆలయ అభివృద్ధికి కృషిచేస్తాం
- పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి

కుల్కచర్ల: శ్రీ పాంబండ రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు శోభాయమానంగా కొనసాగుతున్నాయి. పదిరోజుల నుంచి కొనసాగుతున్న ఈ ఉత్సవాలలో భాగంగా శనివారం తెల్లవారుజామున ప్రధానమైన అగ్నిగుండాల ఘట్టం అత్యంత వైభవంగా నిర్వహించారు. దీనికోసం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. భక్తజన సందోహం మధ్య అగ్నిగుండాల కార్యక్రమం కనుల పండువగా నిర్వహించారు. నూతన తెలుగుసంవత్సరాది ఉగాది పంచాంగ శ్రవణంతో ఈ ఉత్సవాలు ముగియనున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లా పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన భక్తులు రామలింగేశ్వర స్వామిని దర్శించుకునేందుకు బారులు తీరారు.

ఆలయ అభివృద్ధికి కృషి చేస్తాం..

పాంబండ ఆలయ అభివృద్ధికి తాము కట్టుబడి ఉన్నామని పరిగి ఎమ్మెల్యే టీ.రామ్మోహన్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం అగ్నిగుండం కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..అత్యంత ప్రాచీన చరిత్ర కలిగిన పాంబండ రామలింగేశ్వర స్వామి దేవస్థానం అభివృద్ధి కోసం ప్రభుత్వం తరపున, వ్యక్తిగతంగా ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తామన్నారు. ఈ ప్రాంతంలో ఉన్న ప్రాచీన ఆలయాన్ని మరింత అభివృద్ధి చేయాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. దేవాదాయశాఖ ద్వారా అధిక నిధులు మంజూరయ్యేలా రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కోట్ల మైపాల్ రెడ్డి, ఈట బాలనర్సయ్య, డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, కుల్కచర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులుముదిరాజ్, పార్టీ ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్, మాజీ మండల అధ్యక్షుడు వెంకటయ్య, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ గోవర్ధన్ రెడ్డి, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి పేదలకు వరం

- ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి
- సంక్షేమ పథకాలు ప్రతీ పేదోడికి వర్తింపు



బాధితుడికి సీఎం సహాయనిధి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

దోమ: సీఎం సహాయనిధి పేదలకు వరమని ఎమ్మెల్యే టి. రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం దోమ మండల పరిధిలోని లింగస్‌పల్లి అనుబంధ గ్రామమైన ఎల్లారెడ్డిపల్లి గ్రామానికి చెందిన వీరాంజనేయులు కొంత కాలంగా అనారోగ్యంతో ఇబ్బందులు పడుతూ ఆస్పత్రిలో చికిత్స తీసుకున్నారు. ఆయనకు సీఎం సహాయనిధి కింద మంజూరైన రూ.37,500ల చెక్కును పరిగి పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో బాధితుడికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పేదలకు ప్రభుత్వం అనునిత్యం అండగా ఉంటుందన్నారు. ఆపద సమయంలో ఆదుకోవడమే కాకుండా అన్ని సంక్షేమ పథకాలను ప్రతి పేదోడికి అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో లింగస్‌పల్లి మాజీ సర్పంచ్ భర్త వెంకటయ్య, కాంగ్రెస్ నాయకులు నర్సింహులు, కెఆర్‌ఎం రాజు తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతతో విధులు నిర్వహించాలి



దిర్సంపల్లిలో పంచాయతీ కార్యదర్శికి వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం నేతలు

సీపీఎం నాయకులు మైపాల్‌రెడ్డి, చిన్నారెడ్డి, మొగులయ్య

దోమ: గ్రామాల్లో సమస్యలు పరిష్కరించేందుకు అధికారులు బాధ్యతతో విధులు నిర్వర్తించాలని సీపీఎం నాయకులు మైపాల్‌రెడ్డి, చిన్నారెడ్డి, మొగులయ్య పేర్కొన్నారు. శనివారం దోమ మండల పరిధిలోని దిర్సంపల్లి గ్రామంలో సీపీఎం ఆధ్వర్యంలో క్షేత్ర స్థాయిలో సమస్యలను గుర్తించి పంచాయతీ కార్యదర్శికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..గ్రామంలో అనేక సమస్యలు ఉన్నాయని వాటిని త్వరితగతిన పరిష్కరించాలన్నారు. రోజురోజుకు ఎండలు పెరుగుతున్నాయని తాగునీటి సమస్యలు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. చేతి పంపులను, సింగిల్ ఫేస్ మోటార్లను మరమ్మతులు చేయించి ప్రజలకు వినియోగకరంగా ఉంచాలన్నారు.

క్లుప్తంగా

సబితారెడ్డిని కలిసిన బీఆర్‌ఎస్ నాయకులు



సబితారెడ్డిని కలిసిన పట్టణ మండల బీఆర్‌ఎస్ నాయకులు

అనంతగిరి: ఇటీవల వికారాబాద్ పట్టణ, మండల అధ్యక్షుడిగా నియమితులైన గోపాల్ ముదిరాజు, మహిపాల్‌రెడ్డి ఇతర కమిటీ ప్రతినిధులు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ సమక్షంలో మాజీమంత్రి సబితారెడ్డిని హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి మల్లికార్జున్, మండల కార్యనిర్వాహక అధ్యక్షుడు అశోక్, మండల కార్యదర్శి శివకుమార్, మాజీ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, సీనియర్ నాయకులు వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీపీ విత్తనాలతో అధిక దిగుబడులు



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారి మహిపాల్‌రెడ్డి

బంట్వారం: సీపీ838 మొక్కజొన్న విత్తనాలతో అధిక దిగుబడులు వస్తాయని సేల్స్ ఆఫీసర్లు రాఘవేందర్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని బస్వాపూర్‌లో సీపీ విత్తనాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యధిక దిగుబడులు సాధించాలంటే అనువైన విత్తనాలనే ఎంచుకోవాలన్నారు. సీపీ విత్తనాలతో అధిక దిగుబడి, పొడువైన గింజ, మంచి రంగు వస్తాయన్నారు. పెట్టుబడులు కూడా తక్కువగానే ఉంటాయన్నారు. ఏమైనా సందేహాలు ఉంటే తమను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బస్వాపూర్ రైతులు వెంకటయ్య, నారాయణ, రాచప్ప, రవికుమార్, నర్సింహరెడ్డి, ప్రభు, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలందరూ సమానమే

- తహసీల్దార్ తారాసింగ్
- గోనూర్‌లో పౌరహక్కుల దినోత్సవం



గోనూర్‌లో గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న తహసీల్దార్ తారాసింగ్ తదితరులు

తాండూరు రూరల్: గ్రామాల్లో ప్రజలందరూ సమానమేనని తాండూరు తహసీల్దార్ కేతావత్ తారాసింగ్ పేర్కొన్నారు. శనివారం తాండూరు మండలం గోనూర్ గ్రామంలో పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ..గ్రామస్తులు అందరూ కూడా అన్నదమ్ముల్లా కలిసిమెలిసి ఉండాలన్నారు. కులాల మధ్య వివక్ష చూపొద్దని సూచించారు. ప్రతీ మానవుడికి ప్రాథమిక హక్కులు ఉంటాయని, వాటిని ఎవరూ కూడా భంగం కలిగించొద్దని హెచ్చరించారు. ఎలాంటి కులం, మతం, వర్గ విభేదాలు లేకుండా మసలుకుంటామని గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పౌర హక్కుల మండల ప్రత్యేకాధికారి గోవింద్, ఏఎస్‌ఐ పవన్‌కుమార్, జూనియర్ అసిస్టెంట్ బాలు, ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శి నజీర్, గ్రామస్తులు పేర్కొన్నారు.

రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

కొడంగల్ రూరల్: శ్రీసత్యసాయి భజన మండలి కొడంగల్, తాండూరు సమితి ఆధ్వర్యంలో శంకర్ కంటి ఆస్పత్రి సౌజన్యంతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు భజన మండలి సభ్యులు తెలిపారు. పట్టణంలో అభయాంజనేయస్వామివారి ఆలయ సమీపంలోని అక్షరహైస్కూల్లో సోమవారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కంటి పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. దృష్టిలోపం ఉన్న వారు కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

హస్నాబాద్‌లో ఉగాది సంబురాలు

దుద్యాల్: మండలంలోని హస్నాబాద్‌లో శనివారం నుంచే ఉగాది సంబురాలు ప్రారంభమయ్యాయి. గ్రామంలోని ఆలయం వద్ద గల బావి నుంచి జల్ది బిందెలతో నీటిని తెచ్చే కార్యక్రమం నిర్వహించారు. తెచ్చిన నీటిని ఏడాది పాటు ఇళ్లల్లో ఉంచుకోవడం ఆనవాయితీగా వస్తోంది. గతంలో ఉగాది పండుగ రోజు ఈ కార్యక్రమం నిర్వహించేవారు. అయితే పండుగ రోజు భక్తులు ఎక్కువ మంది వచ్చే అవకాశం ఉండటంతో ఒక్క రోజు ముందుగానే ఈ కార్యక్రమం నిర్వహించారు.

ప్రభుత్వ కళాశాలలో చేరండి



విద్యార్థులకు కరపత్రాలు పంపిణీ చేస్తున్న అధ్యాపకులు

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధ్యాపకులు

కొడంగల్ రూరల్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు తమ కళాశాలలో విద్యార్థులు చేరాలని శనివారం ప్రచారం నిర్వహించారు. కళాశాలలో విద్యార్థులకు కల్పిస్తున్న వసతులు, సౌకర్యాలపై అవగాహన కల్పిస్తూ ప్రచారం చేశారు. పట్టణంలో నిర్వహిస్తున్న పదోతరగతి పరీక్షా కేంద్రాల వద్దకు వెళ్లి విద్యార్థులతో మాట్లాడుతున్నారు. కళాశాలలో ప్రభుత్వం కల్పిస్తున్న ఉచిత అడ్మిషన్, విద్య, పాఠ్యపుస్తకాలు, స్కాలర్‌షిప్ సౌకర్యం తదితర అంశాలపై విద్యార్థులకు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ప్రశాంతమైన వాతావరణంలో విశాలమైన తరగతి గదులు, అంకితభావం కలిగిన అధ్యాపకులచే విద్యాబోధన నిర్వహిస్తారని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులకు కళాశాలలో కల్పించే సౌకర్యాలకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు.

కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు వెళ్లా..

సాక్షి ఎఫెక్ట్..

ధారూరు: ఏడుంటరో ఎవరికి తెలియదు! అనే శీర్షికతో శనివారం సాక్షిలో వచ్చిన వార్తకు ధారూరు మండలంలోని నాగసమందర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ మాధవిలత స్పందించారు. తాను శుక్రవారం విధుల్లో భాగంగానే వికారాబాద్‌లోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు వెళ్లానని, ఇద్దరు పేషంట్లకు కాపర్ టీ వేయించడానికి వెళ్లాలని పేర్కొన్నారు. ఆస్పత్రిలోవిధులు నిర్వహిస్తూ, ప్రత్యేక వైద్య శిబిరంలో తన అవసరం ఉంటేనే వెళ్తానని ఆమె పేర్కొన్నారు.

తైబజార్ వేలం



వేలం నిర్వహిస్తున్న ప్రత్యేకాధికారి గ్యామా

దోమ: మండల కేంద్రంలో తైబజార్ వేలాన్ని పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్ శనివారం నిర్వహించారు. ఈ వేలం పాటకు ముఖ్య అతిథిగా ప్రత్యేకాధికారి గ్యామా హాజరై గ్రామస్తుల ఎదుట బహిరంగా వేలం నిర్వహించారు. అదే గ్రామానికి చెందిన పాడి వెంకటయ్య రూ.1,44,000లకు దక్కించుకున్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ..మార్కెట్ అభివృద్ధికి సహరించాలని విజ్ఞప్తి చేశారు.

న్యాయవాదుల సంఘం నూతన కమిటీ ఎన్నిక



తాండూరు న్యాయవాదుల సంఘం నూతన కార్యవర్గ ప్రతినిధులు



పరిగి: నూతన కార్యవర్గాన్ని సన్మానిస్తున్న న్యాయవాదులు

తాండూరు: తాండూరు బార్ అసోషియేషన్ (న్యాయవాదుల సంఘం) ఎన్నికలు శనివారం ప్రశాంతంగా జరిగాయి. తాండూరు మున్సిఫ్ కోర్టు ప్రాంగణంలోని బార్ అసోషియేషన్‌లో 2025–26 సంవత్సరానికి గాను నిర్వహించిన ఎన్నికల్లో ఎన్నికల అధికారిగా సీనియర్ న్యాయవాది మనోహర్‌రావు వ్యవహరించారు. ఈ ఎన్నికలలో తాండూరు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడిగా పి.శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా ఎస్.రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా పి.చంద్రశేకర్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శిగా ఎం.ఆంజనేయులు, కోశాధికారిగా సోఫియాబేగం, మహిళ న్యాయవాది ప్రతినిధిగా అరుణ, లైబ్రేరియన్‌గా ఎండి మస్తాన్‌అలీ, కోర్టు కల్చరల్ ప్రతినిధిగా జిలాని, ఎగ్జిక్యూటివ్ సభ్యుడిగా నరేందర్‌సింగ్, రామయ్యగౌడ్, ప్రకాశ్, మల్లేశ్, శ్రావణ్‌కుమార్‌లు ఎన్నికయ్యారు. ఎన్నికలలో తమకు అవకాశం కల్పించిన బార్ అసోషియేషన్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయవాదులు పాల్గొన్నారు.

పరిగి న్యాయవాదుల సంఘం అధ్యక్షుడిగా ఇబ్రహింఖాన్

పరిగి: పరిగి న్యాయవాదుల సంఘం అధ్యక్షుడిగా ఇబ్రహింఖాన్‌ను ఎన్నుకున్నారు. శనివారం పట్టణ కేంద్రంలో పరిగి న్యాయవాదుల సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా ఉప్పరి ఆనంద్‌రావు, ప్రధాన కార్యదర్శిగా గోపాల్‌నాయక్, కోశాధికారిగా ముకుంద వెంకటేషలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం అధ్యక్షుడు మాట్లాడుతూ న్యాయవాదుల సమస్యలపై నిరంత రం పోరాటం చేస్తమన్నారు. నూతన కార్యవర్గానికి ఎన్నికల ప్రధాన అధికారిగా అందె విజయ్‌కుమార్, సహా అధికారిగా శివారెడ్డి వ్యవహరించారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

అసెంబ్లీలో బంజారా భాష తీర్మాణంపై హర్షం



తాండూరు టౌన్: సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే బీఎమ్మార్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం

తాండూరు టౌన్: గోర్ బోలి బంజారా భాషను రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో చేర్చాలంటూ అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మాణానికి కృషి చేసిన సీఎం రేవంత్ రెడ్డి, తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి చిత్రపటానికి శనివారం స్థానిక అంబేడ్కర్ చౌక్‌లో బంజారా నాయకులు క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం గోర్‌బోలి భాషను గుర్తించి, అసెంబ్లీలో తీర్మాణం చేసి కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేయడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో గోర్‌బోలి నాయకులు చరణ్‌సింగ్ నాయక్, చందర్‌నాయక్, వెంకట్ రామ్ నాయక్, డాక్టర్ పవన్‌కుమార్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పరిగిలో..

పరిగి: గిరిజనులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తుందని ఎమ్మెల్యే టి రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. గోర్‌బోలి భాషపై అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి తీర్మానించడంతో శనివారం గిరిజన సంఘ నాయకులు ఎమ్మెల్యేను సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్నారన్నారు. గిరిజనులు మాట్లాడే భాషను అధికారిక భాషగా గుర్తించాలని కేంద్రానికి తీర్మానం పంపారన్నారు. కేంద్రం ఆమోదం పొందితే గోర్‌బోలి అధికారిక భాషగా గుర్తింపు పొందుతుందన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ శని అమావాస్య పూజలు



మోమిన్‌పేట: మండల పరిధిలోని ఏన్కతల గ్రామంలో వెలసిన శనైశ్చరస్వామి శనివారం శనిఅమావాస్య కావడంతో తైలాభిషేకంతో తరించాడు. భక్తులు ఉదయం 6గంటల నుంచి స్వామి వారిని దర్శించుకునేందుకు క్యూ కట్టారు. శనిఅమవాస్య, శని త్రయోదశి రోజున స్వామి వారికి నల్లని దుస్తులు, నువ్వుల నూనెతో అభిషేకం చేస్తే కోరిన కోర్కెలు తీరుస్తాడన్న భక్తుల ప్రగాఢ నమ్మకం. సప్త వృక్షాల చుట్టూ, హోమగుండం చుట్టూ భక్తులు ప్రదక్షిణలు చేశారు. అనంతరం ఆలయ ఆవరణలోని దేవాలయాలో పూజలు చేసి అన్నదానంలో పాల్గొన్నారు.

◆ పాస్టర్ మృతిపై విచారణ జరిపించాలి

బంట్వారం: పాస్టర్ ప్రవీణ్ పగడాల అనుమానాస్పద మృతిపై తెలంగాణ ప్రభుత్వం విచారణ జరిపించి నిందితులను కఠినంగా శిక్షించాలని తొర్మామిడిలోని మెథడిస్టు చర్చి ప్రతినిధి సిర్రా పద్మారావు విజ్ఞప్తి చేశారు. శనివారం తొర్మామిడిలో మెథడిస్టు చర్చి ఆధ్వర్యంలో ప్రవీణ్ మృతిపై సంతాపం ప్రకటించి సానుభూతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పద్మారావు మాట్లాడుతూ పాస్టర్ మృతిపై తెలుగు రాష్ట్రాల ప్రజలకు అనేక అనుమానాలు ఉన్నాయన్నారు. హత్య చేసి ప్రమాదంగా చిత్రీకరిస్తున్నారని ఆయన విచారం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తొర్మామిడి పాస్టర్ భాస్కర్, స్థానిక క్రైస్తవులు పాల్గొన్నారు.

◆ పన్ను వసూలులో బొంరాస్‌పేట్ టాప్

తాండూరు రూరల్: పన్ను వసూలులో బొంరాస్‌పేట్ మండలం మొదటి స్థానంలో ఉందని డీఎల్‌పీఓ రతన్‌సింగ్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తాండూరు డివిజన్‌లో 8 మండలాలు ఉన్నాయని తెలిపారు. మార్చి 31 వరకు పన్ను వసూలు పూర్తవుతుందని పేర్కొన్నారు. మండలాల వారీగా బొంరాస్‌పేట్‌లో–96 శాతం, దుద్యాల–93, బషీరాబాద్–92, కొడంగల్–90, తాండూరు–87, పెద్దేముల్–86, దౌల్తాబాద్–86, యాలాల–85శాతం పన్నులు వసూలయ్యాయని డీఎల్‌పీఓ తెలిపారు. పన్నులు చెల్లించి గ్రామాభివృద్ధికి సహకరించాలని ఆయన ప్రజలను కోరారు.

◆ పారిశుద్ధ్య పనులు నిర్వహించాలి

తాండూరు: దొడ్డి కొమరయ్య జయంతి వేడుకలకు యశోదనగర్ పార్కులో పారిశుద్ధ్య పనులు నిర్వహించాలని తాండూరు కురుమ సంఘం ప్రతినిధులు మున్సిపల్ కమిషనర్ విక్రంసింహారెడ్డిని కోరారు. శనివారం తాండూరు కురుమ సంఘం ప్రతినిధులు మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందించారు. దొడ్డి కొమరయ్య విగ్రహం వద్ద చెత్తాచెదారం పేరుకుపోయిందన్నారు. ఈ కార్యక్రమంలో ఒగ్గుడోలు కళాకారుల సంఘం ఉపాధ్యక్షుడు పూజారి మల్లప్ప, డివిజన్ అధ్యక్షుడు నాగారం జగదీశ్, ఉపాధ్యక్షుడు పూజారి పాండు, కార్యదర్శి మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.

◆ నిత్యావసర సరుకుల పంపిణీ



నిత్యావసర సరకులు పంపిణీ చేస్తున్న శాసనమండలి చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డి


తాండూరు: తాండూరు పట్టణంలోని సమద్ ఫంక్షన్ హాల్లో ముస్లింలకు శాసన మండలి చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డి, బీసీ కమిషన్ సభ్యులు శుభప్రద్‌పటేల్ నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు.

పశువైద్య శిబిరాలతో రైతులకు మేలు

కుల్కచర్ల: పశువైద్య శిబిరాలతో రైతులకు మేలు కలుగుతుందని పశువైద్యాధికారి హతిరాం పేర్కొన్నారు. శనివారం వీరాపూర్‌లో పశు వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రైతులు పశువైద్యం సంబంధించి ఎటువంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. పాడిపశువుల అనారోగ్య సమస్యలను పరిష్కరించేందుకు తాము గ్రామాల వారీగా వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. రెండు, మూడు గ్రామాలకు కలిపి వైద్య శిబిరాలను నిర్వహించి పాడిసంపద పెంపొందేవిధంగా రైతులకు అండగా ఉంటామన్నారు. పశువుల కోసం గ్రాసం, గడ్డి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఆసక్తిగల రైతులు తమ పట్టాపాసుపుస్తకం, ఆధార్‌కార్డు జిరాక్స్, కులం ధ్రువీకరణపత్రాలు సమర్పించి వాటిని తీసుకువెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది లావణ్య, చెన్నయ్య, అనిల్, గోవింద్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

ఫలితాలను ఆన్‌లైన్లో నమోదు చేయాలి

మండల విద్యాధికారి గోపాల్



సమావేశంలో మాట్లాడుతున్న గోపాల్

పరిగి: విద్యార్థుల ఫలితాలను ఆన్‌లైన్లో నమోదు చేయాలని మండల విద్యాధికారి గోపాల్ సూచించారు. శనివారం పట్టణ కేంద్రంలోని నంబర్1 ఉన్నత పాఠశాలలో మండలంలోని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ఎఫ్ఏ1, ఎఫ్ఏ2, ఎఫ్ఏ3, ఎఫ్ఏ4 పరీక్ష ఫలితాలను తప్పకుండా ఆన్‌లైన్లో నమోదు చేయాలన్నారు. అపార్ జనరేషన్ కూడా ఆన్‌లైన్లో చేయాలని సూచించారు. వచ్చే విద్యా సంవత్సరానికి విద్యార్థుల ఏకరూప దుస్తులు వచ్చాయని వాటిని మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో దుస్తులను కుట్టుతారని తెలిపారు. ప్రతీ విద్యార్థి కొలతలను తీసుకుని దుస్తులను కుట్టాలని ఏపీఎంకు తెలిపారు. విద్యార్థులకు వడ్డించే మధ్యాహ్న భోజనంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం శ్రీనివాస్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు

పీఏసీఎస్ డైరెక్టర్ ప్రభాకర్‌రెడ్డి



గుండాలలో నూతన బోరు మోటార్లను గ్రామ పంచాయతీ సిబ్బందికి అందిస్తున్న ప్రభాకర్‌రెడ్డి

దోమ: వేసవిని దృష్టిలో ఉంచుకొని గ్రామంలో తాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని పీఏసీఎస్ డైరెక్టర్ ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం దోమ మండల పరిధిలోని గుండాల గ్రామంలో తాగునీటి బోర్లు ఉన్నప్పటికి అందులో మోటార్లు లేకపోవడంతో సింగిల్ ఫేస్ మోటార్లను కొనుగోలు చేయించి గ్రామ పంచాయతీ సిబ్బందికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రజలకు తాగునీటి సమస్య రాకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు బాలప్ప, మహిపాల్‌రెడ్డి, మల్లేశ్‌గౌడ్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నేత పాడే మోసిన ఎమ్మెల్యే

గుండాల అనుబంధ తండాకు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు విస్లావత్ చందర్‌నాయక్ అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి స్వగ్రామానికి చేరుకొని అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ముందుగా మృతదేహానికి నివాళులర్పించి పాడే మోశారు. అనంతరం స్థానిక కాంగ్రెస్ నేతలతో కలిసి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..కార్యకర్తల కుటుంబానికి తను అనునిత్యం అండగా ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ ప్రభాకర్‌రెడ్డి, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రామగోవర్ధన్‌రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నేతలు రాంచంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులతో సీసీ రోడ్లు



సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న నాయకులు

దుద్యాల్: మండల కేంద్రంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు జోరుగా సాగుతున్నాయి. శనివారం దుద్యాల్‌లో రూ.10లక్షల నిధులతో కొడంగల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకారం వేణుగోపాల్, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి మెరుగు వెంకటయ్య ప్రారంభించారు. ఈ సందర్భగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం దుద్యాల్ మండల అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ ఖలీల్ పాషా, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీశైలం గౌడ్, ఉపాధ్యక్షుడు కృష్ణ, మాజీ సర్పంచ్ ఖాజా, గ్రామస్థులు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.